www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 28 ఫిబ్రవరి 2023



పరీక్ష కేంద్రాల్లో డిఐఇఒ తనిఖీలు



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డిఐఇఒ

ప్రజాశక్తి-పీలేరు

జిల్లాలో సిసి కెమెరాల నిఘా నడుమ ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఇంటర్ మీడియట్ విద్యాశాఖాధికారి (డిఐఇఒ) ఎం.కృష్ణయ్య తెలిపారు. సోమవారం ఆయన పట్టణంతో పాటు సమీప పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పట్టణంలోని శ్రీచైతన్య, ప్రియదర్శిని, ప్రభుత్వ జూనియర్ కళాశాలతో పాటు కెవి పల్లి మండలంలోని ఎపిఆర్‌జెసి పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసి సంతృప్తిని వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా పరిధిలోని 75 పరీక్షా కేంద్రాల్లో 7,879 మంది విద్యార్థులు ఇంటర్ ప్రాక్టికల్స్‌కు హాజరవుతున్నారని పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో ఆయా పరీక్షా కేంద్రాల నిర్వహణాధికారులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా పిఆర్ ఏకగ్రీవం



రిటర్నింగ్ అధికారి నుంచి ధ్రువపత్రం తీసుకుంటున్న రామసుబ్బారెడ్డి

ధ్రువపత్రం అందజేసిన రిటర్నింగ్ అధికారి

ప్రజాశక్తి-కడప

ఉమ్మడి వైఎస్ఆర్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసిపి అభ్యర్థి పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం నామినేషన్లకు ఉపసంహకరణ కావడంతో ఒకటే నిమినేషన్ ఉండటంతో ఆయన ఎన్నికన ఎకగ్రీవమైంది. జాయింట్ కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి సాయి కాంత్ వర్మ తన చాంబర్‌లో రామసుబ్బారెడ్డికి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ధ్రువపత్రం అందజేశారు. కార్యక్రమంలో మేయర్ సురేష్ బాబు, డిప్యూటీ మేయర్ నిత్యానందారెడ్డి పాల్గొన్నారు.

యుటిఎఫ్ జిల్లా నూనత కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - రాయచోటి

అన్నమయ్య జిల్లా యూటిఎఫ్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా బిల్లా హరిప్రసాద్, షేక్ జాబిర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం రాయ చోటిలోని శివ నర్సింగ్ కళాశాలలో నిర్వహించిన జిల్లా కౌన్సిల్ సమావేశం అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా గౌరవాధ్యక్షుడిగా ఎన్.రవి ప్రకాష్, సహాధ్యక్షులుగా ఎస్.శివారెడ్డి మహిళా సహాధ్యక్షులుగా కె.హేమలత, ట్రెజరర్‌గా బి.చంద్ర, కార్యదర్శులుగా సి.వి.రమణమూర్తి, ఎం.రమణయ్య, వై శ్రీధర్‌రెడ్డి, డి.గంగాదేవి, పురం వెంకటరమణ, ఎ.అక్రమబాష, టి.భాస్కర్‌రెడ్డి, టి.సుధాకర్ నాయుడు. రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా షేక్ జాబిర్, బిల్లా హరిప్రసాద్, కె.హేమలత, డి.చంగల్ రాజు, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా ఎస్.సురేందర్‌రెడ్డిని ఎన్నుకున్నారు. సభ్యులుగా జి.వి.రెడ్డి, అజంతుల్లా, ఎ.శ్రీనివాసులు, బి.గోపాల్ నాయక్, గోపీనాథ్ ఎన్నికయ్యారు. ఈ ఎన్నికలకు యుటిఎఫ్ రాష్ట్ర సహ అధ్యక్షులు కె.సురేష్‌కుమార్ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న విద్యా రంగ వ్యతిరేక విధానాలపై ఉద్యమాలు చేస్తామన్నారు. ఉద్యోగ ఉపాధ్యాయుల హక్కులకై పోరాటాలు చేపడతామని తెలిపారు.



అధ్యక్షులు హరిప్రసాద్



ప్రధాన కార్యదర్శి జాబిర్



కోశాధికారి చంద్రశేఖర్

'ఉద్యమ నేతల విజయానికి కృషి చేయాలి'

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

తూర్పు రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ నియోజకవర్గ పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులుగా పోటీ చేస్తున్న మీగడ వెంకటేశ్వరరెడ్డి, బాబురెడ్డిని గెలిపించి పాలకపక్షాలకు కళ్లు తెరిపించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని విజయనగర్ కాలనీలో ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. నాయకులు మధురవాణి, రామకృష్ణ, ఐద్వా కార్యదర్శి భాగ్యమ్మతో కలిసి ఆయన ప్రచారం నిర్వహించారు. నిరుద్యోగులు, పట్టభద్రులు, ఉద్యోగులు, సామాన్యప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చని పాలక ప్రతిపక్ష పార్టీలను ఓడించి ఉద్యమ నేతలను గెలిపించాలన్నారు. కొత్త ఉద్యోగాలు ఇవ్వకుండా, కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేయకుండా ఉన్న పార్టీల అభ్యర్థులను ఓడించాలని తెలిపారు. మనహక్కుల సాధనకు, సమస్యల పరిష్కారానికి పిడిఎఫ్ అభ్యర్థుల గెలుపు తోడ్పడుతుందన్నారు.



ఇంటింటి ప్రచారంలో సిఐటియు నాయకులు

ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహిద్దాం

- ఎన్నికల నిర్వహణ సమావేశంలో కలెక్టర్ గిరీష

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు వివిధ పార్టీల నాయకులు సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గిరీష రాజకీయ పార్టీ నాయకులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణపై ఎస్పీ హర్షవర్ధన్‌రాజుతో కలిసి వివిధ రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 84 పోలింగ్ కేంద్రాలున్నాయని ప్రతి పోలింగ్ కేంద్రంలోనూ వెబ్ కాస్టింగ్ నిర్వహించడం జరుగుతుందన్నారు. మార్చి 13న నిర్వహించబోయే ఎమ్మెల్సీ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ ఉంటుందని, ఎన్నికల ఏజెంట్లు గంట ముందే పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాలన్నారు. ఈ ఎన్నికలకు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎటువంటి సమస్యలు తలెత్తిన వెంటనే పోలీస్ కంట్రోల్ రూమ్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. సభలు సమావేశాలు నిర్వహించేందుకు 24 గంటల ముందు పర్మిషన్ తీసుకోవాలన్నారు. బ్యానర్లు హోల్డింగులకు, బ్యానర్ల ప్రింటింగ్ తప్పక అనుమతి అవసరమన్నారు. . పోలింగ్‌కు 28 గంటల ముందు 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ఎన్నికలలో ఓటు వేసే ఓటర్లు ఓటర్ స్లిప్‌తో పాటు రేషన్ కార్డు, ఓటర్ కార్డు, ఆధార్ కార్డు, డ్రైవింగ్ లైసెన్సు, పోస్ పోర్టు, ఎంప్లాయ్ ఐడి కార్డు, ఏదైనా ఒకటి గుర్తింపు కార్డుతో వచ్చి ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పేపర్ బ్యాలెట్ సిస్టం ఉంటుందని, పోలింగ్ కేంద్రంలోకి మొబైల్ ఫోను, పెన్నులు తీసుకురాకూడదన్నారు. ఓటర్లు ఓటు వేసే విధానం గురించి కలెక్టర్ వివరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

నిబంధనలు ప్రతి ఒక్కరూ తప్పక పాటించాలి : ఎస్‌పి

ఎమ్మెల్సీ ఎన్నికలలో ఎన్నికల కమిషన్ సూచించిన నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పక పాటించాలని ఎస్పీ హర్షవర్ధన్ రాజు తెలిపారు. ఈ ఎన్నికలలో ప్రజాప్రతినిధులు, ప్రతి ఒక్కరి సహకారం ఎంతో అవసరం అన్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదల అయిన రోజు నుంచి జిల్లాలో ఎన్నికల కోడ్ అమలులో ఉందని ఎన్నికలు సజావుగా, ప్రశాంత వాతావరణంలో సాగేందుకు ఎన్నికల కమిషన్ జారీ చేసిన ఎంసిసి నిబంధనలను, తప్పక పాటించాలన్నారు. ఈ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి పాటించని వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా వివిధ పార్టీల అభ్యర్థులు కుల, మత, ప్రాంతీయపరమైన విద్వేషాలు రెచ్చగొట్టేలా రాజకీయనేతలు ప్రవర్తించకూడదన్నారు. రాజకీయ ప్రకటనల ద్వారా కుల, మతపరమైన అభ్యర్థనలు చేయకూడదన్నారు. మసీదులు, చర్చిలు, ఆలయాలు, ఇతర ప్రార్థన స్థలాల్లో ఎన్నికల ప్రచారం చేయకూడదన్నారు. పోలింగ్ స్టేషన్‌కు ఓటర్లను తీసుకురావడం, తిరిగి తీసుకువెళ్లడం వంటివి నిషిద్ధమన్నారు. అనుమతి లేకుండా బ్యానర్లు కట్టడం, గోడలపై నినాదాలు రాయడం, పోస్టర్లు అతికించడం నిషిద్ధమని తెలిపారు. అనుమతి లేకుండా లౌడ్ స్పీకర్లు ఏర్పాటు చేయరాదన్నారు. వెహికల్ పరిమిషన్ తీసుకున్నవారు. ఎక్కడా డబ్బులు పంపిణీ చేయకూడదని, ఓటర్లను ప్రభావితం చేసే ఎటు వంటి పనులు చేయరాదన్నారు. ఎంసిసి వైలేషన్స్ జరిగినట్లు తమ దృష్టికి వస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లాలో ఎటువంటి చిన్న సమస్యలు తలెత్తిన వెంటనే పోలీస్ కంట్రోల్ రూమ్ కు తెలియజేయాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారియా, డిఆర్ఒ సత్యనారాయణ, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

5లోగా ఓటరు స్లిప్పులు పంపిణీ పూర్తి చేయాలి

మార్చి 5వ తేదీలోగా ఓటరు స్లిప్పులు పంపిణీ పూర్తి చేయాలని, వాలంటీర్లను ఎన్నికల ప్రక్రియకు ఉపయోగించకూడదని, గృహనిర్మాణం, కార్మికుల సమీకరణపై దృష్టి సారించాలని, అసంతృప్తితో ఉన్న స్పందన దరఖాస్తులను తగ్గించాలని, కలెక్టర్ గిరీష అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి పట్టభద్రులు, ఉపాధ్యాయులు ఎమ్మెల్సీ ఎన్నికలు, స్పందన, గ్రామ, వార్డు సచివాలయాలు, గృహనిర్మాణం, రీసర్వే మొదలైన అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందరభంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటరు స్లిప్పుల పంపిణీ, 100 శాతం పంపిణీ, అన్ని పోలింగ్ కేంద్రాల్లో సరైన ఏర్పాట్లు, పోలింగ్ అధికారులకు శిక్షణ వంటి అంశాలపై కలెక్టర్ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. పట్టభద్రులు, ఉపాధ్యాయులందరికీ ఓటరు అవగాహన కల్పించాలని అధికారులను కోరారు.

ఉప ముఖ్యమంత్రి అరెస్టు అప్రజాస్వామికం

మదనపల్లె అర్బన్: బిజెపి రాజకీయ కుట్రలో భాగంగానే ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి మనీషా సిసోడియాను అరెస్టు అని ఆప్ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి ఆరోపించారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉప ముఖ్య మంత్రి అరెస్టు ను తీవ్రంగా ఖండించారు. నీటి నిజాయితీ, స్వచ్ఛమైన పాల నకు నిదర్శనం ఆమ్ ఆద్మీ పార్టీనన్నారు. దేశ వ్యాప్తంగా బిజెపి అధి కారం కోసం ఇతర పార్టీలను ప్రజల్లో పలచన చేయడానికి సిబిఐ, ఇడి, ఎసిబి తదితర వ్యవస్థలను అడ్డం పెట్టుకొని భయభ్రాంతులకు గురించేస్తూ వారి ఎదుగుదల అడ్డుకోవడం కోసం కేసులు పేరుతో ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు. బిజెపికి వ్యతిరేకంగా ముందుకు సాగిన, పేదలకు సహాయ సహకారాలు అందించిన, విద్యార్థులు భవిష్యత్ కోసం పనిచేస్తున్న మంత్రిని అరెస్టు చేయడం శోచనీయమన్నారు. దేశంలో బిజెపి వైఖరికి అరెస్టులే అద్దం పడు ున్నాయని తెలిపారు. రానున్న రోజుల్లో ఓటుతో ప్రజలే గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

జిల్లా కో-కన్వీనర్‌గా మోహన్

మదనపల్లె అర్బన్: సమాచార హక్కు కార్యకర్తల సంఘం జిల్లా కో-కన్వీనర్‌గా మదనపల్లి శ్రావ్య ఇన్ఫోటెక్ డైరెక్టర్ జె.మోహన్‌ని శనివారం సమాచార హక్కు కార్యకర్తల సంఘం వ్యవస్థాపకులు ముత్తు అధికారకంగా ప్రకటించారు. ఈ సందర్భంగా మోహన్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా సమాచార హక్కు చట్టం కార్యకర్తలను ఒక వేదికపై తీసుకు వచ్చి సమాచార హక్కు చట్టం గ్రామ స్థాయిలో ప్రచారం చేయడానికి సంస్థ తరపున కృషి చేస్తామని తెలిపారు. ప్రజా ప్రయోజనాల కోసం సమాచారం సేకరించి అవినీతి అక్రమాలపై చర్యలు తీసుకునే విధంగా ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్తా మన్నారు. రాష్ట్ర సమాచార హక్కు కార్యకర్తల సంఘం అన్నమయ్య జిల్లా కో-కన్వీనర్ గా బాధ్యతలు అప్పగించిన సంస్థ వ్యవస్థాపకులు ముత్తు, రాష్ట్ర కో-ఆర్డినేటర్ ఆంజనేయులు, రాష్ట్ర జాయింట్ కో-ఆర్డినేటర్ డాక్టర్ జివిఎస్.బాబుకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భగా ఆర్‌టిఐ కమిటీ మెంబర్లు రమేష్ బాబు, శివప్రసాద్, మడక సుబ్రహ్మణ్యం సమాచార హక్కు చట్టం-2005 ప్రతి ఒక్కరికీ అర్థమయ్యేలా అవగాహన కలిగించేలా కృషి చేస్తామని తెలిపారు.



నియామక పత్రం అందుకుంటున్న మోహన్



బాధితులతో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష, జెసి తమీమ్ అన్సారీయా

సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేయాలి

ప్రజాశక్తి - రాయచోటి

సామాన్య ప్రజల సమస్యల పరిష్కరమే ధ్యేయంగా చిత్తశుద్ధితో పని చేయాలని అధికారులను కలెక్టర్ గిరీష పిఎస్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో స్పందన కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ గిరీష పిఎస్, జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారియా, డిఆర్ఓ సత్యనారాయణ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి ఉమా మహే శ్వరమ్మ జిల్లా నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో స్పందన కార్యక్రమానికి సమస్యలపై ప్రజలు నుంచి వచ్చే అర్జీలను పరిష్కరించటానికి అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్పందనలో వచ్చిన ప్రతీ అర్జీని క్షుణ్ణంగా చదివి సత్వరం పరిష్కరించాలన్నారు. అర్జీలు పరిష్కరించటానికి వీలుకానివి సరైన కారణాలతో అర్జీదారులకు తెలియజేయాలని పేర్కొన్నారు. అర్జీలు పునరావృతం కాకుండా చూడాలని అధికారులకు సూచించారు. పరిష్కరించిన అర్జీలు రీ ఓపెన్ కాకుండా సమస్యలను ప్రత్యేక శ్రద్ధతో పరిష్క రించా లన్నారు. అర్జీలు బియాండ్ ఎస్ఎల్‌ఏ లోకి వెళ్లకుండా నిర్దేశించిన గడుపులోపల క్లియర్ చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో వివిధ సమస్యలపై బాధితులు వినతి పత్రాలు సమర్పించారు. వాటిని వెంటనే పరిష్కరించాలని కలెక్టర్, జేసి సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో వివిధ జిల్లా శాఖ అధికారులు పాల్గొన్నారు.

టిబి రోగులను దత్తత తీసుకోండి : కలెక్టర్

ప్రజాశక్తి - రాయచోటి

టిబి రోగులను మానవత దృక్పథంతో ప్రతి ఒక్కరూ ముందుకొచ్చి దత్తత తీసుకోవాలని అధికారులను కలెక్టర్ గిరీషసూచించారు. సోమ వారం కలెక్టరేట్‌లోని స్పందన హాల్లో టీబీ రోగుల దత్తతపై అధికారులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పేద క్షయ రోగు లకు పౌష్టిక ఆహారం అందించడానికి దాతలు స్వచ్ఛందంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. తాను ముగ్గురు టిబి పేషెంట్లను దత్తత తీసుకు న్నానన్నారు జాయింట్ కలెక్టర్ ఇద్దరు టిబి పేషెంట్లను దత్తత తీసుకు న్నారన్నారు. కావున పేద క్షయ రోగులకు పౌష్టిక ఆహారం అందించడానికి మానవత దృక్పథంతో జిల్లా అధికారులు, తహసీల్దార్‌లు, ఎంపీడీఓలు ఒకరి చొప్పున తీసుకోవాలని సూచించారు. టిబి రహిత సమాజం కోసం అందరూ కృషి చేయాలన్న సదుద్దేశంతో నిర్ధారిత టిబి పేషంట్ల సమ్మతితో సేవాగుణం కలవారు మందులు వాడుతున్న టిబి రోగులకు 6 నెలలు లేదా ఒక సంవత్సరం పాటు దత్తత తీసుకోవాలని తీసుకోవాలని పిలుపునిచ్చారు. అందులో భాగంగా డిఎంహెచ్ఒకు కలెక్టర్ ముగ్గురు టిబి రోగులను అప్పగించారు.

ఎన్నికల విధులకు మినహాయింపు లేదు : పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల విధులలో ఎవరికి మినహాయింపు లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎన్నికల విధులుకు కేటాయించిన తమ సిబ్బందికి వెంటనే జిల్లా అధికారులు ఆర్డర్ సర్వ్ చేయాలని సూచించారు. ట్రైనింగ్ కు, పోలింగ్ విధులకు తప్పనిసరి హాజరు అయ్యేలా ఆయా శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారియా, డిఆర్ఒ సత్యనారాయణ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

స్పందన ఫిర్యాదులను పరిష్కరించండి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

స్పందన కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులపై తగిన చర్యలు తీసుకోవాలని పురపాలిక కమిషనర్ కె.ప్రమీల తెలిపారు. సోమవారం పురపాలిక కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమంలో ప్రజలు తీసుకొచ్చిన అర్జీలను తీసుకున్నారు. మొత్తం మూడు సమస్యలు వచ్చాయన్నారు. వెన్నెల మహిళ గ్రూపులో సభ్యులు సిద్దమల్లమ్మ మరణించారనీ, ఆమెకు రావలసిన పైకం ఇవ్వాలని, రోడ్డు, వీధిదీపాలు, మురుగు కాలువలు ఏర్పాటు చేయాలని సప్తగిరినగర్ కాలనీ ప్రజలు, దారి చూపాలని అనంగుట్ట ఏరియాకు చెందిన నాగమ్మ అర్జీ ఇచ్చారు. కార్యక్రమంలో పురపాలక సంఘం అన్ని శాఖాధిపతులు పాల్గొన్నారు.

'జీవితం ఎంతో విలువైంది'

ప్రజాశక్తి -కడప అర్బన్

ప్రణాళిక బద్ధమైన, క్రమశిక్షణతో కూడిన జీవితం ఉజ్వలంగా ఉంటుందని యోగి వేమన విశ్వవిద్యాలయం ప్రిన్సిపల్ కృష్ణారెడ్డి అన్నారు. సోమవారం యోగి వేమన విశ్వవిద్యాలయం మనోవిజ్ఞాన శాస్త్ర శాఖ, స్పందన ఈడా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో 'జీవితం అమూ ల్యమైంది- విలువ ఇవ్వండి' అనే అంశంపై అవగాహన కార్యక్రమం సర్ సివి రామన్ సైన్స్ బ్లాక్‌లోని సెమినార్ హాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో అసహజ మరణాలు చాలా జరుగుతున్నాయని తెలిపారు. వాటికి ప్రధానంగా వయస్సు ప్రభావం, మంచి, చెడు విచక్షణ చేయలేకపోవడం, తల్లిదండ్రుల అతిగారాభం, ఇతరుల మాట లకు ప్రాధాన్యత ఇవ్వటం వంటి అంశాలుగా వివరించారు. ప్రతి విద్యార్థీ వారి భవిష్యత్తును ఎలా నిర్మించుకోవాలో ఇలాంటి కార్యక్రమాల ద్వారా అవగాహన పొందవచ్చన్నారు. స్పందన ఈడా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు విజయవంతం మాట్లాడుతూ జీవితంలోని ఒడిదుడుకులను తట్టుకొని ఎలా ముందుకు సాగాలో వివరిస్తూ విద్యార్థుల్లో ప్రేరణ నింపారు. సైకాలజీ అసోసియేట్ ప్రొఫెసర్, సదస్సు కన్వీనర్ డాక్టర్ కె. లలిత కో- కన్వీనర్ సైకాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వి. లాజర్ మాట్లాడుతూ జీవిత విలువల గురించి వక్తలు మాట్లాడిన అంశాలు విద్యార్థులకు ప్రయోజనకరంగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో సహ ఆచార్యులు డాక్టర్ సరిత, డాక్టర్ సునీత, సైకాలజీ అధ్యాపకులు రవీంద్ర, లక్ష్మనరసింహ అశ్వర్థ రెడ్డి పాల్గొన్నారు.

'ఆకాశం ఎందుకు నీలంగా ఉంటుంది'

ప్రజాశక్తి - కడప అర్బన్

జన విజ్ఞాన వేదిక, కడప జిల్లా కమిటీ జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా సర్. సి.వి. రామన్ రచించిన 'ఆకాశం ఎందుకు నీలంగా ఉంటుంది' తెలుగులో ఎం.వి.చలపతి అనువాదం చేసిన పుస్తకాన్ని సోమ వారం ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ రవీంద్రనాథ్, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు రాజశేఖర్ రాహుల్, సైన్స్ ఫ్యాకల్టీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొట్టమొదటి నోబెల్ బహుమతి పొందిన మొదటి భారతీయుడు సర్ సి.వి. రామన్ అని అన్నారు. యూరప్‌కు నౌకలో వెళ్లేటప్పుడు సముద్రం, మంచుకొండలు, ఆకాశం ఎందుకు నీలంగా ఉన్నాయని తనకు తాను ప్రశ్నించుకున్నారు. దానిమీద పరిశోధనలు చేశారు. ఆకాశం నీలంగా ఉండటానికి కాంతి పరిక్షేపణం కారణం అని కనుగొన్నారు. దీన్నే 'రామన్ ఫలితం' అంటారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, సిటీ ఉపాధ్యక్షులు రాయల్ కరిముల్లా ,ఆర్ట్స్ కాలేజీ ప్రొఫెసర్లు బయ్యపరెడ్డి, సుధాకర్ రెడ్డి, ఆదినారాయణ, భూషణం రెడ్డి, రాజేశ్వరి, వెంకట లక్ష్మి, రాజశేఖర్ రెడ్డి, రాజశేఖర్, శ్రీనిత, వీర నాగేంద్ర కుమార్, కల్పన, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళా క్రికెట్ అభివృద్ధికి కృషి

కడప: కడప జిల్లా క్రికెట్ అసోసియేషన్ మహిళా క్రికెటర్ అభివృద్ధికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా సోమవారం జడ్పి హైస్కూల్ జయనగర్ ఫిజికల్ డైరెక్టర్ వెంకటసుబ్బమ్మ, మున్సిపల్ కార్పొరేషన్ హై స్కూల్ ఫిజికల్ డైరెక్టర్ వెంకటలక్ష్మి, వారి విద్యార్థులు 70 మంది కడపలోని వై.ఎస్. రాజారెడ్డి ఎసి స్టేడియంలో శిక్షణ తీసుకున్నారు. వారికి కె. విష్ణుమోహన్‌రావు, ఉమెన్ కో-ఆర్డినేటర్ పి విజయ్‌కుమార్, క్రికెటర్ సంఘం సభ్యులు మాజీ ఐపీఎల్ ప్లేయర్ విచ్చేసి బాలికల ఆట పట్ల అవగాహన కల్పిస్తూ తగు సూచనలు చేశారు. వచ్చిన రెండు పాఠశాల నుంచి దాదాపు 32 మందిని ఎంపిక చేశారు. తగు శిక్షణ ఇచ్చి లీగ్ మ్యాచ్‌లు ఏర్పాటు చేసి తుది జట్టుని నిర్ణయిస్తారు.



శిక్షణలో భాగంగా మెలకువలు తెలియజేస్తున్న విష్ణు మోహన్‌రావు

నేడు డాక్టర్ 'జానమద్ది' వర్ధంతి

ప్రజాశక్తి - కడప అర్బన్

ఈనెల 28న ఉదయం 10 గంటలకు సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలోని బ్రౌన్‌శాస్త్రి సమావేశ మందిరంలో గ్రంథాలయ వ్యవస్థాపకులు డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రి నవమ వర్ధంతి, స్మారకోపన్యాసం నిర్వహిస్తున్నట్లు కేంద్రం సంచాలకులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్య అతిథిగా యోగి వేమన విశ్వవిద్యాలయం ఇన్‌ఛార్జి విసి ఆచార్య రంగ జనార్దన, సభాధ్యక్షులుగా యోగి వేమన విశ్వవిద్యాలయం రిజిస్ట్రర్ ఆచార్య వై.పి.వెంకట సుబ్బయ్య, ప్రధాన వక్తగా పంచసహస్రావధాని డాక్టర్ మేడసాని మోహన్ (తిరుపతి), విశిష్ట అతిథులుగా శ్రీ అచలానంద ఆశ్రమం పీఠాధిపతులు స్వామి విరజానంద (బ్రహ్మంగారి మఠం), యోగి వేమన విశ్వవిద్యాలయ కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఆచార్య టి.శ్రీ నివాస్, పూర్వ శాసనమండలి సభ్యులు పోచంరెడ్డి సుబ్బారెడ్డి, జానమద్ది సాహితీ పీఠం మేనేజింగ్ ట్రస్టీ జానమద్ది విజయభాస్కర్ పాల్గొంటారన్నారు. జానమద్ది వారి ఆత్మీయులు, సి.పి.బ్రౌన్ మెమోరియల్ ట్రస్ట్ పూర్వ సంయుక్త కార్యదర్శి ఎం.జానకిరామ్, జానమద్ది వారి సన్నిహితులు, సాహితీవేత్త ఎస్.ఈశ్వరరెడ్డి (బ్రహ్మంగారి మఠం) ఆత్మీయ సత్కారం అందుకుంటారని తెలిపారు.

మార్చి 2న ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి - కడప

నిరుద్యోగ యువతీ యువకులకు పరిశ్రమ ఆధారిత శిక్షణ, అవకాశాల ద్వారా శ్రీ సిటీ లోని ప్రముఖ మల్టీ నేషనల్ కంపెనీ ఎన్ఎస్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌లో ఉద్యోగాల కోసం మార్చి 2న పేర్లు నమోదు చేసుకున్న అభ్యర్థులకు ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి దాసరి నాగార్జున ఒక ప్రకటనలో తెలిపారు. డిప్లమో అన్ని గ్రూపులు(సివిల్, అగ్రికల్చర్ కాకుండా) 2018 నుండి 2022 సంవత్సరంలో పాసై 18 నుండి 26 ఏళ్ల లోపు వయస్సు కలిగిన యువతీ యువకులు ఇంటర్వ్యూలలో పాల్గొనేందుకు అర్హులని తెలిపారు. పూర్తి వివరాలకు 6300125455, 7892933270లలో సంప్రదించాలన్నారు.

5, 6వ తేదీల్లో లోకేష్ యువగళం పాదయాత్ర

- టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి-పీలేరు

తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్ర మార్చి 5, 6వ తేదీల్లో పీలేరు నియోజకవర్గంలో సాగనుందని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన సమా వేశంలో ఆయన లోకేష్ పాదయాత్ర షెడ్యూల్‌ను ప్రకటించారు. యాత్ర ముందుగా అనుకున్నట్లు మార్చి 4, 5వ తేదీల్లో కాకుండా మార్చి 5, 6వ తేదీల్లో ఉంటుందని, కార్యక్రమంలో జరిగిన మార్పులను పార్టీ శ్రేణులు గుర్తించాలన్నారు. 5న సాయంత్రం లోకేష్ పాదయాత్ర చిత్తూరు జిల్లా నుంచి పీలేరు నియోజకవర్గంలోకి ప్రవేశిస్తుందని, ఆ రోజు సాయంత్రం పీలేరు-చిత్తూరు మార్గంలోని భాస్కర ఐటిఐ వద్ద స్వాగతం, బహిరంగ సభ ఉంటుందన్నారు. పాదయాత్ర అదే రోజు పట్టణ మార్గంలో వేపులబైలు వద్ద ఏర్పాటు చేసే బస వద్దకు చేరుకుంటుందన్నారు. ఆ రోజు పీలేరు పట్టణంతోపాటు మండలంలోని టిడిపి శ్రేణులు పెద్దఎత్తున జనస మీకరణ చేసి పాదయాత్రను విజయవంతం చేయాలని కోరారు. పార్టీ శ్రేణులు ఎవరికీ భయపడకుండా ధైర్యంగా ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వారిని స్వఛ్ఛందంగా పాదయాత్రలో పాల్గొనేలా చూడాలన్నారు. పీలేరు మండలంలోని ప్రతి పంచాయతీ నుంచి 300 మందికి తగ్గకుండా జనం వచ్చేలా చూడాలని సూచించారు. అనంతరం మండలంలోని పంచాయతీలు, బూత్‌ల క్రమంలో సమీక్షించి పార్టీ శ్రేణులకు జన సవీకరణపై దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో నాయకులు కోటపల్లె బాబు రెడ్డి, డాక్టర్ మల్లెల రెడ్డిబాష, అమరనాథరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, పురం రామ్మూర్తి, లక్ష్మీకర, కంచి సూరి, పోలిశెట్టి సురేంద్ర, లడ్డూ జాఫర్, షౌకత్ అలీ, చలమయ్య నాయుడు, షామియాన జయన్న, వెంకటరమణ నాయక్, శేఖర్ రెడ్డి, రహంతుల్లా, భాజాపీర్, ఖాదర్, రెడ్డప్పరెడ్డి, యల్లెల రెడ్డప్పరెడ్డి, రియాజ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కిషోర్‌కుమార్‌రెడ్డి



ఇదేంఖర్మ కార్యక్రమంలో రమేష్‌కుమార్‌రెడ్డి

టిడిపి వెంటే ముస్లిం మైనార్టీలు : ఆర్ఆర్

ప్రజాశక్తి-చిన్నమండెం

ముస్లిం మైనార్టీలందరూ తెలుగుదేశం పార్టీ వైపు చూస్తున్నారని, 2024 సార్వత్రిక ఎన్నికల్లో సంపూర్ణ మద్దతు ఇస్తారని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని బోనమల పంచాయతీ బోనమల కస్బా, కనకంటివారి పల్లె, నాగూరు వాండ్లపల్లె, నగిరి, గొల్లపల్లెల్లో టిడిపి నేతలతో కలిసి ఇదేంఖర్మ రాష్ట్రానికి, రచ్చబండ కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ముస్లిం మైనార్టీలను ఉద్దేశించిన మాట్లాడుతూ టిడిపి హయాంలో ముస్లిం మైనార్టీలకు కేటాయించిన బడ్జెట్ పూర్తి స్థాయిలో ఖర్చు చేసేదన్నారు. టిడిపి అధికారంలో ఉన్నప్పుడు 2015-16 సంవత్సరంలో రూ.540 కోట్లు, 2016-17 కు గాను రూ.710 కోట్లు, 2017-18లో రూ.840 కోట్లు, 2018-19 సంవత్సరానికి గాను రూ.1140 కోట్లు నిధులు కేటాయించిందన్నారు. దుల్హన్ పథకం ద్వారా పేద ముస్లిం యువతుల వివాహాలకు ఒక్కొక్కరికి రూ.50వేలు చెల్లించామన్నారు. విదేశీ విద్యోన్నతి పథకం ముస్లిం విద్యార్థులకు నైపుణ్యాలు పెంచేందుకు స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ద్వారా ప్రత్యేక శిక్షణలు ఇవ్వడం జరిగిందన్నారు.ఇమామ్ లకు గౌరవేతనం, రంజాన్ నెలలో ముస్లింలకు రంజాన్ తోఫాతో పాటు మైనార్టీ కార్పొరేషన్ ద్వారా అర్హులైన పేదలకు స్వయం ఉపాధి పొందుటకు తక్కువ వడ్డీ శాతంతో రుణాలు అందించిందని తెలిపారు. ప్రస్తుత వైసిపి ప్రభుత్వం మైనార్టీల సంక్షేమాన్ని గాలికొదిలేశారని ఆరోపించారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు బెల్లం నరసింహారెడ్డి, రాయచోటి పట్టణ అధ్యక్షులు బోనమల ఖాదర్‌వలి, మాజీ సర్పంచులు చెన్నకృష్ణారెడ్డి, నసిర్ ఖాన్, నాయకులు రాజారెడ్డి, శివారెడ్డి, శ్యామ్ చంద్ర,రమేష్ రెడ్డి, శ్రీరాములు రెడ్డి, ఆనంద్ రెడ్డి, జమీర్ జాకీర్, ఆయూబ్, అజంతుల్లా, ఖయూమ్, అబ్దుల్, లాలూసాబ్, హుమయూన్, ఇంతియాజ్, సిరాజ్, యూనిట్ ఇన్‌ఛార్జిలు హరి, అమర్నాద్‌రెడ్డి, చెన్నకృష్ణారెడ్డి, బాసిత్, అలగాని రెడ్డెప్ప, అలగాని నాగేంద్ర, చిన్న నరుసుపల్లె గోపాల్, చింతా అమర్నాద్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, హాజీ, మన్సూర్ పాల్గొన్నారు.

1న వారపుసంతకు బహిరంగ వేలం

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

మండల కేంద్రమైన నిమ్మనపల్లి గ్రామ పంచాయతీకి చెందిన బస్టాండ్ గేటు, వారపుసంత గేటు, పంచాయతీ షాపింగ్ రూములకు మార్చి 1న బహిరంగ వేలం పాటను నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి గిరిధర్ నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ 2023-24 సంవత్సరానికి సంబంధించి గ్రామ పంచాయతీలోని వారపు సంత గేటు, బస్టాండ్ గేటు కు ఉదయం 11 గంటలకు, తొమ్మిది పంచాయతీ షాపింగ్ రూములకు మధ్యాహ్నం 3 గంటలకు స్థానిక సచివాలయం వద్ద ఎంపిడిఒ, పంచాయతీ విస్తరణాధికారి, స్థానిక సర్పంచు ఆధ్వర్యంలో బహిరంగ వేలం నిర్వహిస్తున్నామని తెలిపారు. వేలం పాటలో పాల్గొనదలచిన వారు బస్టాండ్ గేటుకు రూ.65వేలు, వారపుసంతగేటుకు రూ.1.30లక్షలు ఒక్కొక్క పంచాయతీ షాపింగ్ రూములకు రూ.20 వేల నుంచి రూ.40 వేలు ముందుగా డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని తెలిపారు. పంచాయతీకి బకాయిలు ఉన్నవారు వేలంలో పాల్గొనుటకు అనర్హులు అన్నారు. ఆసక్తి కలిగిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



నీటి పైప్‌ను పరిశీలిస్తున్న ఎంపిపి శ్రీదేవి రవికుమార్

నీటి సమస్య పరిష్కారం : ఎంపిపి

ప్రజాశక్తి- కలకడ

జగనన్న కాలనీలో నీటి సమస్యను పరిష్కరించినట్లు ఎంపిపి శ్రీదేవి రవికుమార్ తెలిపారు. మండలంలోని బాటవారిపల్లి పంచాయతీ అక్కన్నగారికోట సమీపంలో నిర్మిస్తున్న జగనన్న కాలనీలో నీటి సమస్య ఉన్నట్లు ఎంపిపి దృష్టికి తీసుకవచ్చారు. స్పందించిన ఎంపిపి సత్వర చర్యలు తీసుకుని స్కీం బోరుకు పైపులైను ఏర్పాటు చేసి నీటి పరిష్కరించడానికి కృషి చేశారు. జగనన్న కాలనీ లో నీటి సమస్య ఉన్నందున ఇంటి నిర్మాణాలు వేగవంతం చేయలేకపోయారని అన్నారు. నీటి సమస్య పరిష్కారం కావడంతో నిర్మాణాలను వేగవంతం చేయాలని పేర్కొన్నారు. జగనన్న కాలనీలో నిర్మాణాలను ఇకనైనా పూర్తి చేసి సకాలంలో బిల్లులు పొంది పూర్తి చేయాలని లబ్ధిదారులకు సూచించారు. కార్యక్రమంలో ఆర్డబ్ల్యూఎస్ ఎఇ ఇరగన్న ,హౌసింగ్ ఎఇ రమణయ్య, వర్క్ ఇన్స్పెక్టర్ నాగమణి నాయక్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ చరిష్మాంజలి, లబ్ధిదారులు పాల్గొన్నారు.

పిఎం కిసాన్ సమ్మాన్ నిధిపై అవగాహన

ప్రజాశక్తి-కలికిరి

కలికిరి కృషి విజ్ఞాన కేంద్రంలో ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ పథకం గురించి రైతులకు అవగాహన కల్పించారు. కర్ణాటక రాష్ట్రంలోని బెలగావిలో ప్రధానమంత్రి పాల్గొని 13వ విడతలో 16 వేల కోట్లు రైతులకు విడుదల చేశారు. కెవికె సమన్వయకర్త డాక్టర్ జి.ఎస్ పాండురంగ మాట్లాడుతూ ఈ పథకం డిసెంబర్ 1, 2018 నుంచి అమలవుతుందని, అర్హులైన రైతులకు సంవత్సరానికి రూ.6 వేలు మూడు విడతల్లో ఇస్తారని తెలిపారు. రైతులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్య క్రమంలో డాక్టర్ కె.నవీన్, కె.మాధురి, వై.పీరు సాహెబ్, శ్రీనివాసులు రైతులు విద్యార్థులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు : ఎంపిపి

ప్రజాశక్తి-కలికిరి

నీటి ఎద్దడి లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపిపి నూర్జహాన్, ఎంపిడిఒ గంగయ్య సర్పంచులకు, అధికారులను సూచించారు. సోమవారం ఎంపిపి నూర్జహాన్, ఎంపిడిఒ గంగయ్య ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపిడిఒ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ మండల అభివృద్ధికి సంబంధించిన ఆర్థిక వనరుల ద్వారా కలికిరి, టి.సంగ్రవారిపల్లి, దూదేకులవారిపల్లి, పారపట్లగుట్టపాలెం, సొంగటువారిపల్లి, మర్రి కుంటపల్లి, గుండ్లూరు, గ్రామాలకు వాటర్ పైప్ లైన్లను, డ్రైనేజీ, సిసి రోడ్లను మంజూరు మంజూరయ్యాయని తెలిపారు. వీటిని త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని నీటి యెద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అద్దవారిపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్, గంగయ్య మాట్లాడుతూ కొత్తపల్లి గ్రామంలో వీధి లైట్లు రాత్రి పగలు వెలుగుతున్నాయని, దీనివలన విద్యుత్ బిల్లులు ఎక్కువ వస్తున్నాయని, అధికారులు చొరవ తీసుకొని రాత్రిపూట మాత్రమే వెలిగేలా చూడాలని కోరారు. అదేవిధంగా వాటర్ పైప్ లైన్ కూడా వేయించాలని తెలిపారు. గుట్టపాలెం గ్రామపంచాయతీ సర్పంచ్ వెంకటరెడ్డి గుట్టపాలెం కస్పాకు వాటర్‌ట్యాంక్ ద్వారా వాటర్ పైప్‌లైన్ వేయించాలని సమావేశంలో



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి నూర్జహాన్

కోరారు. వీరి సమస్యలపై ఎంపిడిఒ, ఎంపిపి స్పందిస్తూ వీలైనంత త్వరలో ఈ పనులను పూర్తి చేయిస్తామని తెలిపారు. 2010-16, సంవత్సరం లోపు ఆధార్ కార్డులు చేసుకున్నవారు మళ్లీ అప్డేట్ చేయించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో తాహశీల్దార్ భాగ్యలత, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి



చిన్నారులను పరీక్షిస్తున్న డాక్టర్ జులేఖబేగం

ప్రజాశక్తి-నిమనపల్లి

గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజల ఆరోగ్యం పై ప్రత్యేక దృష్టిని సారిస్తున్నట్లు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జులేఖబేగం తెలిపారు. సోమవారం తవళం గ్రామంలో కుటుంబ వైద్యుడి విధానం ద్వారా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించటానికి స్థానిక వైద్య బృందం ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నదని అన్నారు. 104 వాహనం ద్వారా క్షేత్రస్థాయిలో రోగులను పరీక్షించి వారికి వైద్యం అందించి, మందులను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. బిపి, షుగర్ పరీక్షలు నిర్వహించామని తెలిపారు. మహిళకు ప్రత్యేకంగా వైద్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్య సలహాలు, సూచనలు అందించామని పేర్కొన్నారు. వ్యక్తిగత శుభ్రత కలిగి ఉండాలని గ్రామస్తులకు సూచించినట్లు తెలిపారు. అనంతరం తవళం గ్రామం ఎగువపల్లి లోని ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో విద్యార్థులకు ప్రాథమిక పరీక్షలను నిర్మించారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించడానికి తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి కరుణ, ఎఎన్ఎం సిద్దమ్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కమిటీ సభ్యులు

మల్లయ్య కొండ అన్నదాన ట్రస్ట్ సమావేశం

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

స్థానిక దేవదాయ శాఖ కార్యాలయం వద్ద సోమవారం శ్రీ మల్లికార్జున స్వామి వెల్ఫేర్ అసోసియేషన్ అన్నదాన కమిటీ అధ్యక్షుడు రమణారెడ్డి అధ్యక్షతన కమిటీ సమావేశం జరిగింది. మహాశివరాత్రి పర్వదినాన నిర్వహించిన అన్నసంతర్పణ కార్యక్రమ నిర్వహణపై చర్చించారు. భక్తుల విరాళాల ద్వారా వచ్చిన మొత్తం రూ.13,74,620 లు కాగా అన్నదాన ఖర్చు రూ.12,26,159 లుగా నిర్ధారించారు. రూ 1,48,461 రూపాయలు మిగిలిందన్నారు. అన్నదాన నిర్వహణకు సహకరించిన ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్ రెడ్డికి, భక్తులకు కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి రాఘవరెడ్డి ,సభ్యులు ప్రభాకర్ రెడ్డి, శివారెడ్డి, రెడ్డప్ప రెడ్డి, రామచంద్ర ,జుంజర పెంట రమణారెడ్డి, భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

రేపు అభయాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండలంలోని గోపిదిన్నె పంచాయితీ కొత్తపల్లె బస్‌స్టాప్ సమీపంలో ఉన్న శ్రీఅభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. పూజారి మల్లికార్జున అభిషేకాలు ,పూజలు నిర్వహించి భక్తులకు స్వామి దర్శనం కల్పిస్తారన్నారు. తీర్థ ప్రసాదాలు అందజేస్తారన్నారు. గ్రామస్తుల సహకారంతో ఆలయం వద్ద అన్నసంతర్పణ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాత్రికి గుమ్మసముద్రం శంకర కళాకారుల బృందంచే సాసవుల చిన్నమ్మ కథ ప్రదర్శిస్తారన్నారు. భక్తులు పాల్గొని స్వామి కృపకు పాత్రులు కావాలన్నారు.



గొల్లపల్లిలో సుగవాసి ప్రసాద్ బాబును సన్మానిస్తున్న గ్రామస్తులు

దేవరలో నాయకుల సందడి

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

మండలంలోని పాలెంగొల్లపల్లి, దప్పేపల్లి వేములవాండ్లపల్లి గ్రామాలలో జరిగిన దేవరకు సోమవారం మాజీ టిటిడి పాలక మండల సభ్యుడు సుగవాసి ప్రసాద్‌బాబు, మాజీ ఎమ్మెల్యే గడికోట ద్వారకనాథరెడ్డి, టిడిపి నాయకుడు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ఆర్.రమేష్ కుమార్ రెడ్డి పలువురు నాయకులు దేవరలో పాల్గొన్నారు. ఈ నలుగురు నాయకులు గ్రామాల్లో పర్యటించి ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరిస్తూ వెళ్లారు.

యువతకు స్ఫూర్తి చంద్రశేఖర్ ఆజాద్

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

నేటి యువతకు స్వాతంత్ర్య సమరయోధుడు చంద్రశేఖర్ ఆజాద్ స్ఫూర్తి అని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ తెలిపారు. చంద్రశేఖర్ ఆజాద్ వర్ధంతిని పుర్కరించుకుని సోమవారం డివైఎఫ్ఐ అధ్వర్యంలో స్థానిక ఎన్‌జిఒ కార్యా లయంలో కార్య క్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శివ కుమార్ మాట్లాడుతూ చంద్రశేఖర్ ఆజాద్ పూర్తి పేరు చంద్రశేఖర్ సీతారాం తివారీ అని తెలిపారు. స్వాతంత్ర్య కాంక్ష కోసం ఆయన పేరు చివర ఆజాద్ అని పెట్టుకున్న మహానుభావుడన్నారు. ఆజాద్ అంటే స్వేచ్ఛ అన్నారు. స్వాతంత్ర్య సమరయోధులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ సహచరుడని పేర్కొన్నారు. నేడు బిజెపి ప్రభుత్వం స్వాతంత్ర్య సమర యోధులకు తగిన గౌరవం ఇవ్వలేదన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను కాపాడుకోవడం కోసం, యువతకు ఉద్యోగాల కల్పన కోసం భవిష్యత్ పోరాటాల్లో కలిసి రావాలని ఆయన పిలుపునిచ్చారు. చంద్రవేఖర్ ఆజాద్ స్ఫూర్తితో ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ పట్టణ నాయకులు సుభాష్, రాఘవ, సతీష్, సాయి పాల్గొన్నారు.

'సీమ' గురించి మాట్లాడే నైతిక హక్కు టిడిపికి లేదు

- రాయలసీమ పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షులు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

రాయలసీమ గురించి మాట్లాడే నైతిక హక్కు టిడిపికిలేదని రాయలసీమ పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ములపాకు ప్రతాప్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రధాన ప్రతిపక్షం టిడిపి రాయలసీమ కోసం ఈ మూడున్నర ఏళ్లలో ఎక్కడ ప్రశ్నించారని, ఎక్కడ ఉద్యమాలు చేశారని విమర్శించారు. మూడు రోజులుగా కర్ణాటక ప్రభుత్వం నిర్మిస్తున్న అప్పర్ భద్ర ప్రాజెక్టుకు వ్యతిరేకంగా పాదయాత్ర కర్నూలు జిల్లాలో కొనసాగుతున్న విషయం ప్రధాన పత్రికల్లో వస్తున్నా చూడనట్లు నటిస్తున్నారన్నారు. రాయలసీమలో హైకోర్టు రాజధాని, కెఆర్ఎంబి కార్యాలయం రాయలసీమలో ఏర్పాటు కోసం చేసిన ఉద్యమాలు, ప్రయత్నాలు గమనించకపోవడం శోచనీయమన్నారు. గతంలో టిడిపి హయంలో 69జిఒ తెచ్చి శ్రీశైలంలో రాయలసీమ నీటి హక్కు లు శాశ్వితంగా సమాధి చేశారన్నారు. 120జిఒ ద్వారా రాయలసీమ వైద్య విద్యార్థినులకు అన్యాయం చేసిన వారెవరో లింగారెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాజధాని రాయలసీమ హక్కు అయినా కూడా అమరావతికి తరలించింది.. ఎయిమ్స్ హాస్పిటల్‌ను మంగళగిరికి తరలించింది ఎవరో చెప్పా లని ఈ సందర్భంగా డిమాండ్ చేస్తున్నామన్నారు. చరిత్ర తుడిచేస్తే చెరగదని తెలిపారు. రాయలసీమ ఉద్యమకారులు మాత్రమే రాయలసీమ కోసం పని చేస్తారని తెలిపారు. పార్టీలకు అతీతంగా రాయలసీమ కోసం పని చేస్తూనే ఉంటామన్నారు. ఒక పార్టీ కొమ్ముకాసే ప్రసక్తేలేదని ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు.

'గడప గడపకూ' విజయవంతం

ప్రొద్దుటూరు : వైసిపి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గడప గడపకూ మన ప్రభుత్వం అనే కార్యక్రమం నియోజకవర్గంలో సోమవారం నాటికి సంపూర్ణంగా విజయ వంతమైందని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా 213 రోజులు తిరిగి 93వేల గృహాలను పలకరిం చామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మొట్టమొదటిగా పూర్తి చేసుకున్న నియోజకవర్గం ప్రొద్దుటూరు అన్నారు. నియోజకవర్గంలోని రెండు మండ లాలు, పట్టణంలోని 41 వార్డులు, 30 గ్రామ పంచాయతీలు, 49 గ్రామాలు పర్యటించినట్లు తెలిపారు. పట్టణంలో చెప్పుకోదగ్గ సమస్యలు తన దృష్టికి రాలేదన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మురుగునీటి కాలువలు ప్రధాన సమస్యగా తెలిపా రన్నారు. రెండవది విద్యుత్ సమస్య అన్నారు. కార్యక్రమంలో తన దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి రూపొందించిన నివేదికను ముఖ్యమంత్రి జగన్‌కు తెలియజేస్తానన్నారు. అసెంబ్లీ సమావేశాల అనంతరం ఏప్రిల్ మొదటి వారం నుండి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం స్ఫూర్తితో 'జగనన్న పల్లె ప్రగతి' కార్యక్రమాన్ని తన వ్యక్తిగతంగా నియోజకవర్గంలో ప్రారంభిస్తానన్నారు. ఆ సందర్భంగా గుర్తించిన అభివృద్ధి పనులకు అంచనాలు తయారు చేస్తామన్నారు. మే, జూన్ నెలల్లో ముఖ్యమంత్రి ద్వారా నిధులు మంజూరు చేయించుకొని, పనులు పూర్తి చేస్తామని ఎమ్మెల్యే వివరించారు.

రాయల్టీ వసూలు ప్రభుత్వమే చేపట్టాలి

ఎర్రగుంట్ల : మండలంలోని నాపరాయి పరిశ్రమ యజమానుల రాయల్టీ వసూలు ప్రభుత్వమే చేపట్టాలని నాపరాయి పరిశ్రమ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం సమ ర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం హిల్ సైడ్ వ్యూ ఎల్ఎల్‌పి అనే ప్రయివేట్ సంస్థకు రాయల్టీ వసూలు టెండర్ ద్వారా అప్పగిం చిందన్నారు. ఆ సంస్థ ఈ నెల 24 నుండి రాయల్టీ వసూలు కూడా ప్రారంభించిందన్నారు. ఈ సంస్థ ప్రతినిధులు నాపరాయికి సంబంధించిన లారీలను, ట్రాక్టర్లను ఆపి, పెనాల్టీలను వసూలు చేయుటకు స్థానిక మైనింగ్ కార్యాలయాలకు అప్పజెబుతున్నారు. ఇలాంటి పరిస్థితులలో నాపరాయి వ్యర్థాలను తరలించే ట్రాక్టర్లను, గృహ నిర్మాణాలకు వాడుతున్న కట్టుడు రాళ్ళను తరలించే ట్రాక్టర్లను ఆపి ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో తుపాకుల పవన్‌కుమార్‌రెడ్డి, బలరామిరెడ్డి పాల్గొన్నారు.

దళారీ ప్రమేయం లేకుండా విక్రయించాలి

జమ్మలమడుగు రూరల్ : శనగ కొనుగోలు కేంద్రంలో దళారుల ప్రమేయం లేకుండా రైతులు నేరుగా విక్రయించాలని ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు ఇరగంరెడ్డి తిరుపేల్ రెడ్డి సూచించారు. స్థానిక మార్కెట్ యార్డ్‌లో సోమవారం ప్రభుత్వం కొనుగోలు చేస్తున్న బుడ్డ శనగ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ ప్రభుత్వం శనగకు రూ.5,335 మద్దతు ధర ప్రకటించిందన్నారు. మధ్యవర్తులు లేకుండా రైతులు నేరుగా ప్రభుత్వానికి అమ్మి, తమ ఖాతాలో నగదును వేయించుకొనేలా బ్యాంకు పుస్తకాలు ఇవ్వాలన్నారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు కేంద్రంలో తూకాలు సక్రమంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి చంద్రశేఖరరెడ్డి, ఓబులేసు, విఎఎ మాధవరెడ్డి, జమ్మలమడుగు, పెద్దమడియం రైతులు పాల్గొన్నారు. చంద్రఓబుల్‌రెడ్డి, ఎంఇఒ వీరారెడ్డితోపాటు పలువురు హాజరవుతున్న ట్లు తెలిపారు. ఆయా కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానం

కొండాపురం :మండలంలోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకుల విద్యాలయంలో 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి (ఆంగ్ల మాధ్యమం) ఐదవ తరగతి, ఇంటర్మీడియేట్‌లో చేరుటకు బాలికల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తునఆనమని కళాశాల ప్రిన్సిపల్ సి.పరిమళ తెలిపారు. ఈనెల 25వ తేదీ నుండి మార్చి 24వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.



చైర్మన్‌తో మాట్లాడుతున్న జెడి రామాంజనేయులు, ఎడి లావణ్య

మార్కెట్ యార్డ్‌లో రూ.10.25 లక్షలు స్వాహా

చేతివాటం ప్రదర్శించిన కార్యదర్శి

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

లక్కిరెడ్డిపల్లి మార్కెట్ యార్డులో పనిచేస్తున్న ఓ ఉద్యోగి చేతివాటం ప్రదర్శించి రూ.10.25 లక్షలు స్వాహా చేసినట్లు సోమవారం వెలుగులోకి వచ్చింది. కమలాపురం మార్కెట్ యార్డులో కార్యదర్శిగా పనిచేస్తూ 2022 జూన్‌లో బదిలీపై లక్కిరెడ్డిపల్లి మార్కెట్‌యార్డుకు వచ్చారు. అప్పటినుంచి ఆయన రోజువారీగా అన్ని అకౌంట్లు పరిశీలిస్తూ ఉండేవాడు. ఈయన విధుల్లోకి చేరక మునుపు మార్కెట్ యార్డులో రూ.606,940లు ఆఫీసు ఖర్చులు సంబంధించి ఉండేది. ఈ మొత్తాన్ని ఎవరికీ తెలియకుండా కార్యదర్శి ఒక్కడే రోజు కొద్ది కొద్దిగా డబ్బులు డ్రా చేసుకున్నట్లు తెలిసింది. ప్రస్తుతము యార్డు ఖాతాలో రూ.11,006 మాత్రమే ఉందంటే ఇప్పటికి వరకు ఆయన ఖాతాలో నుంచి రూ.6,95,394లు స్వాహా చేసినట్లు సమాచారం. అంతేకాకుండా అక్కడే పని చేస్తున్న ఓ మహిళ ఉద్యోగి రవణమ్మ ఖాతాలో పిఎఫ్ కింద రూ.7,23,131ఉండేది. ఈమె ఖాతాలో నుంచి రూ.4,29,891 రూపాయలను మార్చుకున్నారు. తన చేతివాటం ఉపయోగించి రూ.10,25,825, మొత్తం స్వాహా చేసినట్లు రికార్డులు కనిపిస్తున్నాయి. ఈ విషయం చైర్మన్ విశ్వనాధరెడ్డి దృష్టికి వెళ్ళగా ఆఉద్యోగిని ప్రశ్నిస్తే రెండు నెలలు గడువు ఇస్తే డబ్బులు చెల్లిస్తానులేనని నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు చైర్మన్ తెలిపారు. ఈ విషయాన్ని చైర్మన్ రాష్ట్ర కమిషనర్ జెడి, ఎడిల దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే జెడి రామాంజనేయులు, ఎడి లావణ్యలు మార్కెట్ చేరుకొని రికార్డులు పరిశీలించారు. ఈ మొత్తాన్ని అక్కడ పనిచేస్తున్న కార్యదర్శి డబ్బులు మార్చుకొని స్వాహా చేసినట్లు చైర్మన్ అధికారులకు తెలిపారు. జెడి, ఎడిలు విచారణకు రావడంతో కార్యదర్శి సోమవారం విధులకు డుమ్మా కొట్టారు. అధికారులు రికార్డులను పరిశీలించి కార్యదర్శిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

రూ.28 లక్షలతో కల్వర్టు నిర్మాణం

ప్రజాశక్తి-బి.కొత్తకోట



భూమిపూజ చేస్తున్న సర్పంచ్ రవీంద్రారెడ్డి

ఐసిఐసిఐ సంస్థ సహకారంతో పట్టణంలోని వేమిలేటికోట పంచాయతీలో రూ.28 లక్షల వ్యయంతో కల్వర్టు నిర్మాణానికి సోమవారం సర్పంచ్ రవీంద్రారెడ్డి భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 40 దశాబ్దాల కాలంలో పంచాయతీలో జరగనటువంటి అభివృద్ధిని ప్రస్తుత ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో కేవలం నాలుగు సంవత్సరాలలో చేసి చూపించామని అన్నారు. ఇప్పటికే పంచాయతీలో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు. సిసిరోడ్లు, మురుగునీటి కాలువల పనులను పూర్తి చేశామన్నారు. పంచాయతీ అభివృద్ధికి ఎమ్మెల్యే తగినన్ని నిధులను మంజూరు చేయిస్తున్నారని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఆయన సహకారంతో పంచాయతీని మరింత అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వైసిపి ప్రచార కార్యదర్శి ఆయూబ్ బాషా, నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

మత్స్యకారులకు రూ.9.12 లక్షల రుణం

ప్రజాశక్తి-పీలేరు



మాట్లాడుతున్న మేనేజరు ప్రసాద్ నాయుడు

పట్టణంలో చేపల విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేసుకోడానికి వీలుగా మత్స్యకారులకు రూ.9.12 లక్షలు రుణాలను మంజూరు చేసినట్లు జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ లిమిటెడ్ పీలేరు బ్రాంచ్ మేనేజరు ప్రసాద్ నాయుడు తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మత్సకారులు తీసుకున్న రుణాలతో స్థానిక వారపు సంతలో ఎనిమిది చేపల విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేసుకుంటున్నారని చెప్పారు. ప్రభుత్వం వీరికి 30 శాతం సబ్సిడీపై ఈ రుణాలను మంజూరు చేసిందని, వారి ఉపాధి కోసం ప్రభుత్వం రూ.3.72 లక్షలు సబ్సిడీ మంజూరు చేసిందని తెలిపారు.

క్రైం కార్నర్

టిప్పర్ బోల్తా : డ్రైవర్ పరిస్థితి విషమం

ప్రజాశక్తి-ములకలచెరువు



తీవ్రంగా గాయడిన ప్రదీప్ కుమార్

టిప్పర్ బోల్తాపడి డ్రైవర్ పరిస్థితి విషమించింది. ఆదివారం రాత్రి ములకల చెరువు మండలం బురకాయల కోటలో జరిగిన ఘటనపై పోలీసుల వివరాలిలా ఉన్నాయి. మధ్యప్రదేశ్, విజయగావ్ గర్ గైతాలై కట్నీ కు చెందిన శామ్యూల్ కుమారుడు ప్రదీప్ కుమార్ ములకలచెరువు నుంచి మదనపల్లికి వచ్చే మార్గంలో ఎదురుగా వస్తున్న బస్సును తప్పించబోయి అదుపు తప్పడంతో టిప్పర్ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో టిప్పర్ డ్రైవర్ ప్రదీప్ కుమార్ తీవ్రంగా గాయపడటంతో బాధితున్ని స్థానికులు 108 వాహనంలో మదనపల్లి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రి అత్యవసర విభాగం వైద్యులు ప్రథమ చికిత్స అందించి పరిస్థితి విషమంగా ఉందని మెరుగైన వైద్యం కోసం తిరుపతి ఆసుపత్రికి రెఫర్ చేశారు. ఆ బాధితున్ని పిఎల్ఆర్ కంపెనీ ప్రతినిధులు వెంటనే ఆసుపత్రికి తరలించారు. ఘటనపై ఎస్ఐ డివైఎస్.స్వామి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఘర్షణ : కేసు నమోదు

ప్రజాశక్తి-కలకడ

ఇరువరకాలపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. మండలంలోని ఎర్రకోటపల్లి పంచాయతీ ఎల్లంకివారిపల్లి హరిజనవాడకు చెందిన వంగిమల్ల రెడ్డప్ప కుమారుడు వంగిమల్ల రమేష్‌ను పాత కక్షల కారణంగా అదే గ్రామానికి చెందిన వంగిమల్ల మల్లికార్జున అతడి తమ్ముడు వంగిమల్ల వెంకటేశ్వర్లు కలసి కర్రలతో కొట్టి గాయపరిచినట్లు ఫిర్యాదు పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అదే గ్రామానికి చెందిన వంగిమల్ల రమేష్, అతని అనుచరులు కలిసి మల్లికార్జునను, అతని భార్య శోభారాణిలను పాత కక్షల కారణంగా దాడి చేసినట్లు మల్లికార్జున ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇరువర్గాలపై కేసులు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఐదుగురు పేకాట రాయుళ్లు అరెస్టు

ప్రజాశక్తి-పెద్దమండ్యం

మండలంలోని బండమీదపల్లి గ్రామ పంచాయతీ తురకపల్లికి చెందిన ఐదుగురు పేకాట రాయుళ్లను అరెస్టు చేసినట్లు ఎస్ఐ వెంకటేష్ తెలిపారు. సోమవారం పేకాట శిబిరాలపై దాడులు చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకొని అరెస్టు చేశామన్నారు. వీరిపై కేసు నమోదు చేసి, వారి వద్ద నుంచి రూ.9,400 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ ప్రేర్కొన్నారు. ఈ దాడుల్లో హెడ్ కానిస్టేబుల్ శ్యాం ప్రకాష్, పీసీ విశ్వనాద్ పాల్గొన్నారు.